క్లుప్తంగా

కలశాభిషేకానికి ముమ్మర ఏర్పాట్లు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన శ్రీపెనుశిల లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో బుధవారం చిలుక ద్వాదశిని పురస్కరించుకుని శ్రీలక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లకు అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించన్నారు. అందుకు సంబంధించి ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీవారి అలంకార మండపంలో ప్రత్యేక మండపాన్ని సిద్ధం చేశారు. అందులో 108 కలశాలకు దారం చుట్టి అందులో వివిధ నదీజలాలను నింపనున్నారు. ఈ జలాలతో స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించనున్నారు.

కానరాని ప్రజాప్రతినిధులు

చిల్లకూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి మంగళవారం అధికారులు మాత్రం హాజరయ్యారు. ప్రజాప్రతినిధులు ఒక్కరు కూడా రాకపోవడంతో మరోసారికి వాయిదా వేశారు. మండల సర్వసభ్య సమావేశం గతంలో నిర్వహించి 90 రోజులు కావస్తుండడంతో ఎంపీడీఓ గోపి ఆధ్వర్యంలో ఎంపీపీ తుపాకుల వెంకటరమణమ్మ అనుమతితో సమావేశం నిర్వహించేలా అధికారులు, ప్రజాప్రతినిధులకు సమాచారం అందించారు. అయితే సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కాగా, 12 మంది ఎంపీటీసీలలో ఒక్కరు కూడా రాలేదు. కనీసం ఎంపీపీ కూడా హాజరు కాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు.

అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలి

గూడూరు రూరల్: గ్రామ పంచాయతీలను అబివృద్ధి చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాల ని నెల్లూరు జిల్లా పరిషత్ సీఈఓ రామ్మోహన్‌రావు సూచించారు. గూడూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఇతర శాఖల అధికారులతో సమావే శం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిధులను ఎలా వినియోగించాలో ఆయా పంచాయతీ కార్యాలయాలలో చర్చించి, నిర్ణయం తీసుకోవాలన్నారు. త్వరితగతిన గ్రామాలలో సమావేశాలు నిర్వహించుకుని పనులు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో డివిజనల్ పంచాయతీ అధికారి రమణ, ఎంపీడీఓ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

రాపూరు: రైతులు వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారి సోమసుందరం తెలిపారు. రాపూరు మండలం గండూరుపల్లి గ్రామంలో మంగళవారం రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని సూచించారు. రైతులు తమ పంటల్లో భూసార పరీక్షలు నిర్వహించి, వాటి అనువైన ఎరువులు వినియోగిస్తే మేలు చేకూరుతుందన్నారు. ప్రతి రైతు పంట బీమా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది అనిత, శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

ఉత్తుత్తి ఉచిత బస్సు

- ఎన్నికల వేళ అబద్ధపు హామీలు..
- అధికారం చేపట్టి 5 నెలలైనా అతీగతి లేదు..
- సూపర్‌సిక్స్ నమ్మి ఓట్లేసిన అక్కచెల్లెమ్మలు



సైదాపురం, దక్కిలి: ఏరు దాటే దాకా ఓడ మల్లన్న.. ఏరు దాటాక బోడి మల్లన్న అన్నట్లు కూటమి నేతలు తీరు ఉందని మహిళలు పెదవి విరుస్తున్నారు. ఐదు నెలలకు పైగా పాలన గడిచినా అక్క చెల్లెమ్మలకు ఇచ్చిన ఏ ఒక్క హామీపైనా నిర్ణయం చేయకపోవడంపై మోసపోయామని తెలుసుకుంటున్నారు. సాధారణ ఎన్నికల వేళ టీడీపీ కూటమి నేతలు సూపర్‌సిక్స్ పేరిట ఎన్నికల మేనిఫెస్టోలను విడుదల చేసి ఊదరగొట్టారు. అధికారం చేపట్టిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తామని గొప్పలకు పోయారు. సూపర్‌సిక్స్‌పై విస్తృత ప్రచారం చేసి మహిళా ఓటర్లను ఆకట్టుకున్నారు. వీటిని నమ్మి మహిళలు ఓట్లేశారు. అయితే ఒక్క హామీ కూడా ఇప్పటి వరకు నెరవేర లేదు. ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ ఉత్తిదేనా.. అని ప్రశ్నిస్తున్నారు. తిరుపతి జిల్లాలో వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, చంద్రగిరి, సత్యవేడు, తిరుపతి నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో తిరుపతి నియోజకవర్గంలో జనసేనకు పట్టం కట్టారు. వీరు గెలుపులో మహిళా ఓటర్లే కీలకం కావడం విశేషం. తాజా ఎన్నికల లెక్కల ప్రకారం జిల్లాలో 18,12,980 మంది ఓటర్లు ఉండగా వారిలో 9,29,466 మంది స్త్రీలు ఉన్నారు. జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో ఇదే లెక్క... ఈ క్రమంలో మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అని హామీలు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో 75శాతం రూట్లు గ్రామీణ ప్రాంతాలకు సేవలు అందిస్తుండగా, నిత్యం ప్రయాణికుల్లో 33 శాతం మంది ప్రయాణికులు జిల్లా పరిధిలో రాక పోకలు సాగిస్తుండడం విశేషం.

సోషల్ మీడియాలో...

మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీపై సీఎం చంద్రబాబుతోపాటు సంబంధిత శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి కూడా త్వరలోనే అని చెప్పడం తప్పితే స్పష్టత ఇవ్వడం లేదు. ఇటీవల సోషల్ మీడియాలో ఆగస్టు 15 నుంచి అనే వదంతులు హల్‌చల్ చేసిన విషయం అందరికీ తెలిసిందే. ఆ రోజు కూడా మహిళలకు నిరాశే మిగిలింది. 'సూపర్‌సిక్స్ హామీలైతే ఇచ్చాం.. కానీ ఇప్పుడు పరిస్థితి చూస్తుంటే భయమేస్తుంది' అని సీఎం పేర్కొనడంతో హామీలు అమలుకావని మహిళల అనుమానాలకు మరింత బలం చేకూ తోంది.

సమాధానం చెప్పాలి



మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని కూటమి నేతలు ఇచ్చిన హామీ ఇప్పటి వరకు పట్టాలెక్కలేదు. పక్క రాష్ట్రాల్లో అధికారం చేపట్టిన వెంటనే అక్కడి ప్రభుత్వాలు హామీలు పక్కాగా అమలు చేశాయి. మెట్ట ప్రాంతాల మహిళలు తమ రెక్కల కష్టంపై ఆధారపడుతారు. వారు పండించిన పంటల రవాణా, విక్రయించడం కోసం ప్రయాణాలు చేస్తారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అమలు చేస్తే వారికి కొంత మేర ఊరట కలుగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ హామీపై మహిళలకు సమాధానం చెప్పాలి.

\- మల్లారపు నీరజ, సైదాపురం

గ్రామీణ మహిళలే అధికం



జిల్లాలో అధిక సంఖ్యలో మహిళలు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారున్నారు. ఉచిత బస్సు ప్రయాణం వారికి ఎంతో మేలు చేకూర్చుతుంది. హామీ ఇచ్చేటప్పుడు ఆచరణకు సాధ్యమా.. అసాధ్యమా అని ఆలోచన చేయాలి. ఎన్నికల్లో గెలిచి, సీఎం పీఠంపై కూర్చుని ఇప్పుడు హామీలు చూస్తుంటే భయమేస్తోంది అంటే ఎలా.. ఉచిత బస్సు ప్రయాణం తక్షణమే అమలు చేయాలి.

\- గుంటమడుగు గీతాంజలి

హామీ అమలు చేయరా?



కూటమి నేతల మాటలు నమ్మి మహిళలు ఓట్లేశా రు. ఇప్పుడు మాట తప్పుతున్నారు. హామీ అమలుకు కనీసం కసరత్తు చేసినట్లు కూడా కనిపించడం లేదు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కలగానే అనిపిస్తుంది. మహిళలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి.

\- తిరకాల విజయ, ఊటుకూరు, సైదాపురం మండలం

మూడు చోట్ల పిడుగుపాటు

కోట: మండలంలో మంగళవారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. రెండు గంటలపాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వర్షంతో పాటు భారీ శబ్దంతో ఉరుములు రావడంతో జనం భయాందోళన చెందారు. కోట సమీప ప్రాంతంలో మూడు చోట్ల పిడుగుపాటు చోటుచేసుకుంది. వంజివాకలో దశరథరామిరెడ్డి ఇంటి సమీపంలోని కొబ్బరి చెట్టుపై పిడుగు పడి చెట్టు కాలిపోయింది. దీని ప్రభావంతో ఇంట్లోని విలువైన వస్తువులు సైతం కాలిపోయినట్లు బాధితుడు తెలిపారు. ఉచ్చూరివారిపాళెం, శ్యామసుందరపురంలో పిడుగుల ధాటికి రెండు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సూళ్లూరుపేట: ఆటో కార్మికులకు ప్రత్యేకంగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, వారి కుటుంబాలను ఆదుకోవాలని ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి నాగేంద్రబాబు కోరారు. సూళ్లూరుపేట పట్టణంలోని మార్కెట్ సెంటర్ వద్ద కొజ్జెంబట్టు ఆటోస్టాండ్‌ను మంగళవారం నూతనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 సంవత్సరాలు నిండిన ఆటో కార్మికులకు పింఛన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆటో కార్మికులకు సున్నా వడ్డీకే బ్యాంక్ రుణాలు మంజూరయ్యేలా కూడా చూడాలన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సి.సుధాకర్‌రెడ్డి, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

సూళ్లూరుపేట: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వలంటీర్ల విషయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుని, వారిని మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కత్తి రవి డిమాండ్ చేశారు. సూళ్లూరుపేట పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో అఖిల భారత యువజన సమాఖ్య, వలంటీర్లతో కలిసి మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలని, రూ.10 వేలు వేతనం కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ అనుబంధ విభాగాలకు చెందిన నాగేంద్రబాబు, శ్రీనివాసులు, బాలు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

రాపూరు: ఆర్టీసీ డిపోలోని సమస్యలపై బుధవారం 3 గంటల నుంచి 4 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. డిపోలోని సమస్యలపై సూచనలు, సలహాలు అందించాలని ఆయన కోరారు. ఫోన్ నెంబర్ 99592 25651కు డయల్ చేయాల్సిందిగా కోరారు.

కండలేరులో 50.857 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 50.857 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 2200 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. సత్యసాయి గంగ కాలువకు 1000, పిన్నేరు కాలువకు 120, లోలెవల్ కాలువకు 160, మొదటి బ్రాంచ్ కాలువకు 50 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా కార్తీకమాస పూజలు

ఓజిలి: మండలంలోని పలు ఆలయాల్లో మహిళలు కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. భట్లకనుపూరు గ్రామంలోని శ్రీజ్ఞాన ప్రసూనంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయంలో మహిళలు కార్తీక దీపాలను వెలించారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అభిషేకాలు చేపట్టారు. ధ్వజస్తంభానికి శిఖరదీపాన్ని వెలిగించారు. మానమాల గ్రామంలోని సాయిబాబా మందిరంలో మహిళలు కార్తీక దీపాలను వెలిగించి పూజలు చేపట్టారు.

అభ్యంతరాలపై అధికారుల విచారణ

చిల్లకూరు: బూదనం గ్రామంలో నిబంధనలు మీరి పరిశ్రమను ఏర్పాటు చేయడంపై కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ పంటా శ్రీనివాసులురెడ్డి గత వారం జిల్లా కలెక్టర్ తదితరులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ మండల స్థాయి అధికారులను ఆదేశించారు. దీంతో మంగళవారం గూడూరు డీఎల్‌పీఓ వెంకటరమణ, తహసీల్దార్ శ్రీనివాసులు గ్రామంలో విచారణ చేపట్టారు. గ్రామసభ ఏర్పాటు చేసి వారి నిర్ణయం మేరకు నివేదికలను ఉన్నతాధికారులకు అందిస్తామని అధికారులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

14న శిక్షణ తరగతులు

సైదాపురం: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జీపీడీపీ, బీపీడీపీ 2025–26 సంబంధించి ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులకు ఒక్క రోజు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, వైద్యాధికారులు, ఏఓ, ఏఈలు, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు, పశువైద్యాధికారులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు అందరు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు అధికారులకు ప్రత్యేక శిక్షణ

పెళ్లకూరు: మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం మండల స్థాయి అధికారులు, సిబ్బందికి ఓరియంటేషన్ శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు మంగళవారం ఎంపీడీఓ ప్రమీలా రాణి తెలిపారు. ఉదయం 9 నుండి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించే ఈ శిక్షణా కార్యక్రమానికి జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు, వీఓలు, కంప్యూటర్ ఆపరేటర్లు, డిజిటల్ అసిస్టెంట్లు హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు.

అయ్యప్ప అన్నదాన ట్రస్ట్ సేవలు ప్రారంభం


అయ్యప్ప స్వామి పూజలు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయ సమీపంలో ఉన్న అయ్యప్ప అన్నదాన ట్రస్ట్ సేవలను మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, బాలాజీ దంపతులు ప్రారంభించారు. ప్రతి ఏడాది అయ్యప్ప, శివమాలధారణ స్వాములతో పాటు భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేస్తుంటారు. చైర్‌పర్సన్ దంపతులతోపాటు అయ్యప్ప స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం జరిగిన అన్నదాన కార్యక్రమానికి దాతగా చైర్‌పర్సన్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. 40 రోజులపాటు మాలధారణ స్వాములకు ప్రతిరోజు మధ్యాహ్నం అన్న ప్రసాదాలను ఉచితంగా అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బైనా మల్లికార్జున్‌రెడ్డి, కటకం జయ రామయ్య, పలువురు గురు స్వాములు పాల్గొన్నారు.

సాగరమాల రోడ్డు నిర్మాణానికి సహకరించాలి

కోట: సాగరమాల రోడ్డు నిర్మాణ పనులకు రైతులు సహకరించాలని కోట, వాకాడు తహసీల్దార్‌లు జయజయరావు, రామయ్య సూచించారు. మండలంలోని కొత్తపాళెం, ఊనుగుంటపాళెంలో మంగళవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగరమాల రోడ్డు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. రైతులు సహకరించి భూములు ఇస్తేనే రోడ్డు నిర్మాణం అనుకున్న గడువులోగా పూర్తవుతుందన్నారు. భూములిచ్చిన వారికి వెంటనే నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. అభ్యంతరాలు లేని రైతులు పూర్తి ఆధారాలతో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ బాషా, ఆర్ఐ మధులత పాల్గొన్నారు.

పెంచలకోనలో వర్షం

రాపూరు: మండలంలోని పెంచలకోన, రాపూరులో మంగళవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. రాపూరులో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం కలిగింది. పెంచలకోనలో వర్షాలకు కొండలపై మేఘాలు అలముకోవడంతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది.

సైదాపురంలో వర్షం

సైదాపురం: అల్పపీడనం ప్రభావంతో మంగళవారం ఉదయం నుంచి ఓ మోస్తరు వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి రైతులు వ్యవసాయ పనులు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఉదయం నుంచి జోరున వాన కురుస్తుండడంతో కూలీలు పనులకు స్వస్తి పలికారు.

అధికారుల సలహాలు పాటించాలి

సూళ్లూరుపేట రూరల్: రబీ సీజన్‌లో రైతులు ఎరువులు, మందుల వాడకంలో వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలని వ్యవసాయ సబ్ డివిజన్ ఏడీఏ అనిత తెలిపారు. సూళ్లూరుపేట మండలంలోని గోపాల్‌రెడ్డిపాళెం, ఎస్‌పీ కండ్రిగ గ్రామాల్లో పొలంబడి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి కవిత తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ సీపీ అధినేతతో సూళ్లూరుపేట నాయకులు


వైఎస్ఆర్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో నాయకులు

సూళ్లూరుపేట: వైఎస్ఆర్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మంగళవారం సూళ్లూరుపేట, తడ మండలాలకు చెందిన నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి, తడ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కొళవి రఘు, గండవరం సురేష్‌రెడ్డి, గోగుల తిరుపాల్‌యాదవ్, బోడేలు శరత్ గౌడ, కారూరు చంద్ర, మునస్వామిరెడ్డి, నరేష్‌రెడ్డి కలిశారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

సైదాపురం: వరి సాగులో రసాయనిక ఎరువుల మోతాదులను తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చని ఏఓ హైమావతి కోరారు. మండలంలోని దేవరవేమూరు రైతు భరోసా కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిమ్మ తోటలు సాగు చేసే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని కోరారు. ఇటీవల కురిసిన వర్షాలకు నిమ్మ రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమగ్రంగా వివరించారు. అలాగే ఎలాంటి చీడపీడలు సోకినా తమ దృష్టికి తేవాలని కోరారు. రసాయనిక ఎరువుల వాడకం ద్వారా భూసారం తగ్గుతుందన్నారు. పచ్చిరొట్ట, సేంద్రియ ఎరువులను వినియోగించాలన్నారు.

అట్రాసిటీ కమిటీ సభ్యులకు దరఖాస్తు చేసుకోండి

చిల్లకూరు: గూడూరు సబ్ డివిజన్ పరిధిలో అట్రాసిటీ కమిటీ సభ్యులుగా పని చేసేందుకు అర్హత ఉన్నవారు దరఖాస్తును చేసుకోవాలని మంగళవారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా ఒక ప్రకటనలో కోరారు. గూడూరు సబ్ డివిజన్ పరిధిలో షెడ్యూల్ కులాలు, తెగల వారిపై సామాజిక సేవా దృక్పథం, పౌర హక్కుల చట్టం, అత్యాచార నిరోధక చట్టాలపై అవగాహన కలిగిన వారు, దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. అలాగే గతంలో చేపట్టిన సాంఘిక సేవా కార్యక్రమాలకు చెందిన వివరాలు, తగిన ఆధారాలతో బయోడేటాను జత చేసి కార్యాలయ పని వేళలో ఈ నెల 27లోగా దరఖాస్తులను స్వయంగా అందించాలని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ, ప్రభుత్వ ఉద్యోగులు ఇందుకు అనర్హులని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, సభ్యులు నాన్ అఫిషియల్ సభ్యులు(అనధికార సభ్యులు) రెండు ఎస్సీ, ఎస్టీ కాని, ఇతర కులాలకు చెందిన వారు(స్వచ్ఛంద సంస్థలు) రెండు ఖాళీలు ఉన్నాయని వీటికి దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

ఇన్‌చార్జి కార్యదర్శుల నియామకం

రాపూరు: మండలంలోని పలు గ్రామాలకు ఇన్‌చార్జి కార్యదర్శులను నియమించినట్లు ఎంపీడీఓ భవాని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధారణ బదిలీల్లో కొంతమంది కార్యదర్శులు వెళ్లిపోవడంతో పరిపాలనా సౌలభ్యం కోసం ఇన్‌చార్జులను నియమించినట్లు తెలిపారు. రాపూరు–1కు ధనలక్ష్మి, జోరేపల్లికి పావని, సంక్రాంతిపల్లికి రమేష్, గుండవోలు, తూమాయికి ప్రభాకర్, బొజ్జనపల్లికి అనాల్సా, ఆకలివలసకు సుకన్య, గోనుపల్లికి మాధవి, తెగచర్లకు అశోక్‌ను నియమించినట్లు ఆమె తెలిపారు.

శ్రీనివాసన్ ట్రస్టుతో స్వయం ఉపాధి


అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసన్ సేవాసంస్థ క్లస్టర్ ఇన్‌చార్జి జైసింగ్

వెంకటగిరి రూరల్: టీవీఎస్ మోటార్‌సైకిల్ అనుబంధ సంస్థ శ్రీనివాసన్ సేవా ట్రస్ట్ ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, మహిళలు స్వయం ఉపాధి కల్పిస్తున్నట్టు క్లస్టర్ ఇన్‌చార్జి జైసింగ్ పేర్కొన్నారు. శ్రీనివాసన్ సేవాసంస్థ ఆధ్వర్యంలో గుండసముద్రం గ్రామాన్ని సందర్శించి, అవగాహన కల్పించారు. మంగళవారం శ్రీనివాసన్ సేవాసంస్థ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. వెంకటగిరిలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. వెంకటగిరి రూరల్ మండలం గుండ్లసముద్రం ఎస్టీకాలనీని మోడల్ విలేజ్‌గా చేసేందుకు సన్నద్ధమైనట్లు తెలిపారు. గిరిజనుల ఉపాధి కోసం చేపల వలలు, గొర్రెలను యూనిట్స్ రూపంలో 80శాతం సబ్సిడీతో పంపిణీ చేశామన్నారు. పక్కాగృహాల మంజూరు, గ్రామానికి వెళ్లేందుకు చప్టా నిర్మాణం, తాగునీటి ఆర్‌ఓ ప్లాంట్‌లు ఏర్పాటు చేశామన్నారు. ప్రోగ్రాం అధికారి సతీష్, ప్లానింగ్ టీమ్ అధికారి గోపాల్, పీఆర్‌ఓ ప్రసాద్, సిబ్బంది ధనుష్, అలేఖ్య, కేశవులు, సురేష్, పార్థు, సాయిచరణ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం


బూదూరు వద్ద పొలాల్లోకి దూసుకువెళ్లిన అపాచీ బస్సు

దొరవారిసత్రం: ఎదురుగా వస్తున్న ఎద్దులను తప్పించే ప్రయత్నంలో అపాచీ బస్సు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకువెళ్లిన ఘటన బూదూరు గ్రామ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు... దొరవారిసత్రం మండలం ఆర్మేనికండ్రిగ గ్రామ నుంచి సూళ్లూరుపేట మండలం మంగానెల్లూరు గ్రామం మీదుగా సుమారు 45 మంది కార్మికులతో తడ మండలం మాంబట్టు ప్రాంతంలోని అపాచీ కంపెనీకి బయల్దేరింది. బస్సు బూదూరు గ్రామ సమీపం వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఎద్దులను తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పి పొలాల్లోకి దూసుకువెళ్లింది. దీంతో బస్సులోని కార్మికులు ఏం జరిగిందో తెలియక ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. పొలాల్లోకి బస్సు వాలిపోయి ఆగిపోయింది. దిక్కుతోచని స్థితిలో కార్మికులు బస్సులో నుంచి బయటకు పరుగులు తీశారు. మహిళా కార్మికులు అయితే తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మొత్తానికి ఎవరికి ఎలాంటి ప్రమాదం జరకగపోవడంతో ఒక్కసారిగా అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి

సూళ్లూరుపేట రూరల్: పంచాయతీలకు వస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని ఆయా గ్రామాలను ఉన్నత స్థాయిలో అభివృద్ధి చేసుకోవాలని మండల ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సూళ్లూరుపేట మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళిపై కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీసీటీలు, జెడ్పీటీసీలకు మంగళవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎస్ఐఆర్‌డీ పరిశీలకుడు ప్రసాద్, ఎంపీడీఓ ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో సీఈఓ విచారణ

వాకాడు: తిరుమూరు గ్రామ చెరువు వివాదంపై కొందరు చేసిన ఫిర్యాదు మేరకు మంగళవారం జిల్లా పరిషత్ సీఈఓ ఎం.రామ్మోహన్‌రావు వాకాడు ఎంపీడీఓ కార్యాలయంలో విచారణ జరిపారు. గతంలో తిరుమూరు చెరువులో కొందరు కర్రతుమ్మ కట్టె నరికి విక్రయించారని గ్రామ పంచాయతీకి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు అప్పటి ఎంపీడీఓ గోపీనాథ్, సెక్రటరీ సురేష్‌లను సీఈఓ విచారణ చేశారు. ఈ విచారణలో వచ్చిన వివరాలను పరిశీలించి త్వరలోనే తగు చర్యలు తీసుకుంటామని సీఈఓ తెలిపారు. ఈయన వెంట ఎంపీడీఓ అన్నపూర్ణారావు, సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

గూడూరు రూరల్: పోటుపాళెం శ్రీనివాస గిరిజన కాలనిలో ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన ఆటోవాలా కుటుంబానికి మంగళవారం ఆర్థిక సాయం అందించారు. దాతలు మాట్లాడుతూ గిరిజన కాలనీకి చెందిన ప్రసాద్ పాలు రవాణా చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడని అయితే ప్రమాదవ శాత్తు అతను మృతి చెందాడని తెలిపారు. అతని భార్య, చిన్నారి అనాథలుగా మారారని, వారికి రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. గాలి ప్రకాష్‌నాయుడు, మన్నవరపు నరేష్, కౌశిక్‌రెడ్డి, గ్రామంలోని పాఠశాల సిబ్బంది, నాగరాజు, సవిడి కిషోర్ పాల్గొన్నారు.